క్లుప్తంగా

పూలాజీబాబా ధ్యాన్ మందిర్ వార్షికోత్సవం



నివాళులర్పిస్తున్న భక్తులు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని శ్రీశ్రీ సంత్ సదుర్గ పూలాజీబాబా ధ్యాన్ మందిర్ 19వ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పూలాజీబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పూలాజీబాబా సూచించిన భక్తిభావాన్ని అలవర్చుకోవాలన్నారు. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ అండ్ ఉద్యోగల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాకురే రాందాస్, ప్రధాన కార్యదర్శి కరాడే మారుతి, డాకురే మాధవ్, బక్కన్న, పవాన్, మాధవ్, గజానంద్, తిరుపతి, వామన్, శివాజీ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ దీక్ష



నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బోథ్: ఎస్సీ వర్గీకరణ చట్టాలను అసెంబ్లీలో ఆమోదించకుండా గ్రూప్స్ ఫలితాలను వెల్లడించడం సరికాదని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. ఎస్సీ వర్గీకరణను చట్టసభల్లో ఆమోదించాలని వారు డిమాండ్ చేస్తూ చేస్తున్న దీక్షలు మండల కేంద్రంలో మూడో రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం అర్ధనగ్న ప్రదర్శన చేశారు. దీక్షలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్, శంకర్, స్వామి కిరణ్ అశోక్ రాజు పోతరాజు శ్రీకాంత్ దేవన్న, హనుమాన్లు పాల్గొన్నారు.

నార్నూర్: వర్గీకరణ చట్టం తర్వాతనే గ్రూప్ 1,2,3 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేపట్టాలని, మాంగ్ కులస్తులను గ్రూప్(బి)లో చేర్చాలని మూడు రోజులుగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేస్తున్నారు. శుక్రవారం నోటికి నల్ల రిబ్బన్ కట్టుకొని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లేపల్లి నవీన్ మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాదిగలకు ఇచ్చిన హామీల నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కొన్ని లోపాలను సవరించే వరకు ఉద్యోగ భర్తీ ప్రక్రియ వర్గీకరణ చట్టం ద్వారానే జరగాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సుదర్శన్ కాంబ్లే, విజయ్ కిరణ్ చిప్పకుర్తి, హనుమంతు కాంబ్లే, జిల్లెపల్లి గణేష్, తిరుమలేష్, సునీల్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఘనంగా కుస్తీ పోటీలు



కుస్తీ పోటీలో పాల్గొన్న మల్లయోధులు

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలో శుక్రవారం మహారాష్ట్ర, తెలంగాణ మల్లయోధులతో కుస్తీ పోటీలను ఘనంగా నిర్వహించారు. కుస్తీ పోటీల ఫైనల్‌లో మహారాష్ట్రలోని హిమయత్‌నగర్‌కు చెందిన బోర్‌గడి సతీష్ యాదవ్, నాసిక్‌కు చెందిన సాయినాథ్ కారాడే విజయం సాధించి రూ. 20 వేల నగదు గెలుచుకున్నారు. కుస్తీ పోటీలలో 40 మంది వరకు మల్లయోధులు పాల్గొన్నారు. ప్రేక్షకుల మధ్య కుస్తీ పోటీలు రసవత్తరంగా జరిగాయి. అన్ని విభాగాల కుస్తీ పోటీలకు రూ.1 లక్ష వరకు ఖర్చు చేశారు. కార్యక్రమంలో ఎస్సై అప్పారావ్, మాజీ సర్పంచ్ పరచ సాయన్న, ఉప సర్పంచ్ చట్ల విలాస్, చట్ల నందకుమార్, చట్ల గజ్జుయ్య, దీసీ రమణ, విజేందర్, చట్ల ఉత్తం, బత్తిని కిషన్, వెంకట రమణ, సూర్యవంశీ పాండు, అల్లం రాజు, ప్రభాకర్, రాములు పాల్గొన్నారు.

రోడ్డుపైనే మురుగునీరు..!

భైంసాటౌన్: పట్టణంలోని నర్సింహానగర్‌లో నర్సింహ ఆలయం వెనుక వీధిలో మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. డ్రైనేజీ నిర్మించకపోవడంతో ఇళ్లలోని మురుగు నీరు ఇలా రోడ్డుపైనే చేరుతోంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నారు. కనీసం కచ్చా డ్రెయిన్ అయినా నిర్మించి రోడ్డుపై మురుగునీరు పారకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

భక్తి మార్గంలో నడవాలి

తానూరు: ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన భారత్ మహారాజ్ సూచించారు. మండలంలోని మొగ్గి గ్రామంలో గురువారం రాత్రి నిర్వహించిన కీర్తన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు భక్తిమార్గంపై పలు సూచనలు చేశారు. ఆధ్యాత్మిక సాధనతోనే ప్రశాంతత సాధ్యమని.. చెడువ్యసనాలకు దూరం ఉంటూ ఆధ్యాత్మిక బాటలో పయనించాలని పేర్కొన్నారు. భక్తులు పాల్గొన్నారు.

రంగుల సంబురం



బజార్‌హత్నూర్‌లో..



తాంసి: హోళీ జరుపుకుంటున్న గ్రామస్తులు



తలమడుగు: చిన్నారుల సందడి



బేల: హోలీ సంబురాల్లో యువకులు

జిల్లా వ్యాప్తంగా హోలీ వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఒకరిఒకరు రంగులు చల్లుకొని సందడిగా గడిపారు. డప్పు చప్పుళ్లకు, డీజే పాటలకు యువత స్టెప్పులేశారు. తలమడుగు మండల బీఆర్ఎస్ నాయకులు బోథ్ ఎమ్మెల్యే ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు రంగులు పూశారు. నేరడిగొండ మండల కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



నేరడిగొండ: హోలీ సంబురాల్లో ఎమ్మెల్యే అనిల్ జాదవ్



ఇచ్చోడ: నృత్యం చేస్తున్న యువకులు



ఇంద్రవెల్లి: హోలీ ఆడుతున్న చిన్నారులు



ఉట్నూర్‌రూరల్: యువత కేరింత



సిరికొండ: ఎస్సైకి హోలీ శుభాకాంక్షలు తెలుపుతున్న యువకులు



ఆదిలాబాద్‌టౌన్: హోలీ జరుపుకుంటున్న న్యాయవాదులు



హోలీ వేడుకల్లో యువతుల ఆనందం

ముమ్మరంగా సీసీరోడ్ల నిర్మాణం



వాన్‌వాట్ గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణ పనులు

ఆదిలాబాద్‌రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా ఆదిలాబాద్ రూరల్, మావల మండలలో సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఆయా మండలలో ఈ నిర్మాణాలు చేపడుతున్నారు. ఆర్థిక సంవత్సరం ముగింపు 31 మార్చిలోగా పనులు పూర్తి చేయకపోతే నిధులు ల్యాప్స్ అయ్యే అవకాశం ఉండడంతో పనులు వేగంగా కొనసాగుతున్నాయి.

జోరుగా పనులు..

ఆదిలాబాద్ రూరల్ మండలంలో 34 గ్రామ పంచాయతీలు ఉండగా 123 పనులకు రూ. 4.42 కోట్ల వ్యయంతో, మావల మండలంలో 3 గ్రామ పంచాయతీలుండగా రూ. 36 లక్షల వ్యయంతో పనులు చేపడుతున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో సీసీ రోడ్డు, మురికి కాలువల మౌలిక వసతులు కలుగనున్నాయి. ప్రతి ఆర్థిక సంవత్సరం ముగింపు మాసం మార్చిలోనే ఈ నిర్మాణ పనులు చేపట్టడం గమనార్హం. మార్చి 31లోగా ఆయా గ్రామాల్లో చేపడుతున్న సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి ఉందని మండల పంచాయతీ రాజ్ ఏఈ సంతోష్ తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుల ఆందోళన



ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నార్నూర్: ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిని అన్యాయంగా అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసస్తూ శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం చేస్తుండంగా సీఐ రహీం పాషా ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఫాక్స్ చైర్మన్ ఆడే సురేశ్ మాట్లాడుతూ.. తెలంగాణలో నియంత పాలన కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ సాక్షిగా ప్రశ్నిస్తే అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేస్తున్నారని ఆరోపించారు. గత ఎన్నికల్లో అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు విశ్వసించడం లేదన్నారు. ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిపై సస్పెండ్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఊర్వేత రూప్‌దేవ్, సయ్యద్ ఖాసిం, రమేశ్‌రాథోడ్, ఫిరోజ్ ఖాన్, శివాజీ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కత్తితో దాడి

- రిమ్స్ ఆస్పత్రికి తరలింపు
- వివరాలు అడిగి తెలుసుకున్న డీఎస్పీ జీవన్ రెడ్డి



వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ జీవన్ రెడ్డి, జైనథ్ సీఐ సాయినాథ్

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): మద్యం మత్తులో పలువురు వ్యక్తులు ఇద్దరిపై కత్తులతో దాడి చేశారు. దీంతో వారిద్దరు తీవ్రంగా గాయపడ్డారు. జైనథ్ సీఐ సాయినాథ్, ఎస్సై పురుషోత్తం తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన విష్ణు, భోరజ్ మండలంలోని రాంపూర్‌కు చెందిన నలుగురు వ్యక్తులు శుక్రవారం సాయంత్రం 7 గంటల సమయంలో గూడ గ్రామానికి వెళ్లారు. గూడలోని అంబేడ్కర్ విగ్రహం సమీపంలో అజయ్, అశోక్ అనే ఇద్దరు వ్యక్తులు అక్కడ కూర్చొని ఉన్నారు. విష్ణుకు చెందిన ద్విచక్ర వాహనంపై అజయ్ చెయ్యి పెట్టగా తన వాహనంపై ఎందుకు చెయ్యి పెట్టావని విష్ణు, ఆయనతో పాటు ఉన్న పలువురు దుర్భాషలాడారు. మాటమాట పెరిగి విష్ణు, రాంపూర్‌కు చెందిన పలువురు వ్యక్తులు అజయ్‌పై చిన్న కత్తితో కడుపులో పొడిచారు. అడ్డు వచ్చిన అశోక్‌పై సైతం కత్తితో దాడి చేశారు. వీరిని చికిత్స నిమిత్తం స్థానికులు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి రిమ్స్ ఆస్పత్రికి వెళ్లి బాధితుల ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. విష్ణుతో పాటు పలువురు వ్యక్తులు ఈ దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ వివరించారు.

రోజూ పేపర్ చదవాలి..

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ జ్యోతి బాపూలే (ఎంజేపీ)బాలుర గురుకులంలో భౌతిక శాస్త్రం బోధించే అజీజ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్(జేఎల్)గా ఎంపికయ్యాడు. ఈనెల 12న హైదరాబాద్ రవీంద్రభారతిలో నియామక పత్రం అందుకున్నారు. జిల్లాకేంద్రంలోని గాజుల్‌పేట్‌కు చెందిన అజీజ్ రాచాపూర్ గురుకులంలో పని చేస్తూనే పోటీపరీక్షలకు సన్నద్ధమయ్యాడు. టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన ఫలితాల్లో 32వ ర్యాంకు సాధించాడు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువకులకు అజీజ్ పలు సూచనలు చేశారు. నోట్స్ తయారు చేసుకోవాలని పేర్కొన్నారు.

శిథిలావస్థల్లో డీఆర్‌డిపో భవనం



ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మలో జీసీసీ డీఆర్‌డిపో భవనం శిథిలావస్థకు చేరుకుంది. గతంలో జీసీసీ (గిరిజన కోఆపరేటివ్ సొసైటీ) ఆధ్వర్యంలో భవనం నుంచి తక్కువ ధరలో పప్పులు, నూనే, సబ్బులు ఇలా అనేక రకాల వస్తువులు విక్రయించే వారు. వేసవిలో గిరిజనులు సేకరించిన ఇప్పపువ్వు కొనుగోళ్లు చేసేవారు. అయితే కొన్నేళ్లుగా భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనానికి మరమ్మతులు చేపట్టి ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

– ఇచ్చోడ

మందుబాబులపై కొరడా

- జిల్లా కేంద్రంలో పోలీసుల స్పెషల్‌డ్రైవ్
- 80 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు
- వాహనాలు సీజ్



డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీని పరిశీలిస్తున్న డీఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: మందుబాబులపై పోలీసులు కొరఢా ఝులిపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంతో పాటు ఆదిలాబాద్ డివిజన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్ ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆదిలాబాద్ పట్టణంలో నాలుగు చెక్‌పోస్టులు ఏర్పాటు చేయగా.. డివిజన్ పరిధిలోని 12 పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 8 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆయా ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. యువకులు హోలీ సంబురాల్లో మునిగితేలుతూ కొంత మంది మద్యం సేవించి వాహనాలు నడిపించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించిన పోలీసులు కేసులు నమోదు చేశారు. సీజ్ చేసిన వాహనాలను ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరిగిందన్నారు. ఒకరోజు ముందుగానే హెచ్చరికలు జారీ చేసినప్పటికీ కొంత మంది మద్యం సేవించి వాహనాలు నడిపించడం జరిగిందన్నారు. డివిజన్ పరిధిలో 80 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయడం జరిగిందని, రాత్రి వరకు ఈ ప్రక్రియ కొనసాగించడం జరుగుతుందని వివరించారు. తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని, ఏవైనా ప్రమాదాలు జరిగితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. డీఎస్పీ వెంట ట్రాఫిక్ సీఐ ప్రణయ్, సిబ్బంది ఉన్నారు.

వెయ్యేళ్ల బాసర శిల్పాలను పరిరక్షించాలి



శిల్పాలను పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి

బాసర: బాసరలోని పాపహరేశ్వరస్వామి ఆలయం ముందు వెయ్యి ఏళ్లనాటి శిల్పాలను పరిరక్షించాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి పేర్కొన్నారు. కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు, స్థానిక చరిత్రకారులు బలగం రామ్ మోహన్ ఇచ్చిన సమాచారంతో శుక్రవారం బాసర పరిసరాల్లోని చారిత్రక ఆనవాళ్లు, శాసనాలను పరిశీలించారు. ఆంజనేయస్వామి ఆలయం ముందు 11వ శతాబ్దం జైన శాసనం, గణేశాలయంలో ఎనిమిదో శతాబ్ది నాటి 5 అడుగుల ఎత్తున్న బాదామి చాళుక్య గణేశ శిల్పం, పాపహరేశ్వరాలయం ముందున్న 9, 12వ శతాబ్దానికి చెందిన జైన యక్షిణి, భైరవ, లింగం, నంది, గణేశ, సతి శిలలు, దాన శాసనాలు, విరిగిన శిలా తోరణాలను భద్రపర్చాలని పేర్కొన్నారు. వారి వెంట బి.సుధాకర్ సింగ్, ధర్మేంద్ర కిరణ్, మోతీలాల్ తదితరులు ఉన్నారు.

నాడు జలకళ.. నేడు వెలవెల



జలకళతో కుంటాల జలపాతం (ఫైల్)

కుంటాల జలపాతం ప్రస్తుతం జలధారలు లేక వెలవెలబోతోంది. ప్రకృతి సహజసిద్ధంగా ఏర్పడిన జలపాతం అందాలను వీక్షించేందుకు ఉమ్మడి జిల్లాతోపాటు ఆయా రాష్ట్రాల నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ప్రస్తుతం జలపాతం జలధారలు లేక బోసిపోతోంది. దీంతో పర్యాటకుల తాకిడి తగ్గింది. - నేరడిగొండ



ప్రస్తుతం నీటిధారలు లేక వెలవెలబోతున్న కుంటాల జలపాతం

కొనసాగుతున్న చెట్ల నరికివేత



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

దస్తురాబాద్: మండలంలోని దేవునిగూడెం సమీపంలో ఏర్పాటు చేసిన హరితవనంలో చెట్ల నరికివేత కొనసాగుతుంది. శుక్రవారం గ్రామస్తులు మరో 150 చెట్లను నరికివేశారు. దీంతో అటవీశాఖ అధికారులు.. గ్రామస్తులతో చర్చల్లో పురోగతి కన్పించడం లేదు. పోచమ్మ ఆలయ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేస్తేనే చెట్ల నరికివేత నిలిపివేస్తామని గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ ఓ గీతారాణి, అటవీశాఖ అధికారులు ప్రభాకర్, శ్రీనివాస్, నిమాస్ తదితరులు ఉన్నారు.